గణపతికి కుంకుమపూజ



రామడుగు: కుంకుమపూజలో మహిళలు



శంకరపట్నం: కరీంపేటలో..

హుజూరాబాద్: గణేశ్ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని సూపర్‌బజార్ రోడ్డులోని వినాయక మండపం వద్ద కుంకుమ పూజ ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనగా వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానంచేపట్టారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామంలో యువనేస్తం యూత్ ఆధ్వర్యంలో గణపతి హోమం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని కోరటపల్లి గ్రామంలో మహిళలు వేదపండితుల ఆధ్వర్యంలో కుంకుమపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జూపాక తులసీప్రియమునీందర్, నాయకులు కట్ట రవీందర్, లక్ష్మీరాజం, గాదె భూమయ్య, సాగర్, నిర్మలతో పాటుగా మహిళలు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కరీంపేట వినాయక మండపం వద్ద మహిళలు కుంకుమ పూజ చేశారు. కేశవపట్నం మెయిన్‌రోడ్డులో భక్తులు పూజలు చేయగా ఎత్తుగడ్డ వద్ద ఏర్పాటు చేసిన మండపం వద్ద అన్నదానం చేపట్టారు.

జమ్మికుంట: పట్టణంలో వివిధ గణపతి మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, సీపీసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, మాజీ కౌన్సిలర్లు గాజుల భాస్కర్ దాయ్యాల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ సీనియర్‌నాయకులు మొలుగు దిలీప్, రామడుగు రవీందర్‌రావు నాయకులు,భక్తులు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలోని వినాయక మండపాలలో అన్నదానం, కుంకుమపూజ, భజనలు నిర్వహించారు. పలు వినాయక మండపాల వద్ద రాత్రి అన్నప్రసాద వితరణ చేశారు.



హుజూరాబాద్‌రూరల్: చెల్పూర్ గ్రామంలో గణపతి హోమం



జమ్మికుంట: పూజల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, తదితరులు



మానకొండూర్‌రూరల్: మండలంలోని జమ్మికుంట మార్గంలో పోచంపల్లి–పచ్చునూర్ మధ్యలో కెనాల్ మీదున్న బ్రిడ్జి గుంతలమయమై శిథిలావస్థలోకి చేరుకొని ప్రమాదకరంగా ఉంది. ఓ వైపు బ్రిడ్జి కృంగింది. నిత్యం వందలాది ఇసుక లారీలు, బస్సులు, బైక్‌లు వెళ్తుంటాయి. వాహనదారులు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రమాదం జరగక ముందే అధికారులు, నాయకులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

క్లుప్తంగా

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

గన్నేరువరం: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన పనులపై నాల్గో విడుత సామాజిక తనిఖీ ప్రజావేదికకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. సామాజిక తనిఖీ బృందం వారం రోజులుగా గ్రామసభలు నిర్వహించింది. గన్నేరువరం మండలం ఏర్పడినప్పటి నుంచి ఇది నాల్గో సామాజిక తనిఖీ. మొదటిది 2020 మార్చి, రెండోది 2023 ఆగస్టు, మూడోది 2024 సెప్టెంబర్‌లో, నాల్గో విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక(సోషల్ ఆడిట్) సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించనున్నారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు 16 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులపై క్షేత్రస్థాయి సామాజిక తనిఖీ బృందం సభ్యులు పరిశీలించారని, గ్రామసభలు నిర్వహించారని, గన్నేరువరం రైతువేదికలో ఉదయం 11 గంటలకు కూలీలు, అధికారులు, సిబ్బంది సమక్షంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించి చేపట్టిన పనులపై పూర్తి స్థాయి నివేదికను వెల్లడించడం జరుగుతోంది ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.

గ్రామాల్లో కొనసాగుతున్న సంక్షేమ పథకాల జాతర



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

చిగురుమామిడి: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల జాతర కొనసాగుతోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొండాపూర్, ఉల్లంపల్లి గ్రామాల్లో కార్యకర్తలు అభివృద్ధి పనులను సందర్శించి సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల త్వరగా పూర్తిచేయాలని కోరారు. సీసీరోడ్డు పనులు ముమ్మరం చేయాలని సూచించారు. సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. సీఎం సహాయనిధి, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అర్హులకు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు వడియా సుధాకర్‌రెడ్డి, కానవేని శివకుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుతుబుద్దీన్, మండల ఉపాధ్యక్షుడు ఠాకూర్ నరేందర్‌సింగ్, అందె సురేశ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయిని వేణుగోపాల్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అందె మేకల పర్శరాములు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షాబుద్దీన్, కిసాన్ సెల్ అధ్యక్షుడు కాంతాల మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్మానం



చొప్పదండి: పీఎంశ్రీ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ మంగతాయారు ఆదివారం ఉద్యోగ విరమణ చెందగా ఉపాధ్యాయులు, తోటి సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పదేళ్ల ఆమె సేవలను కొనియాడారు.

రామడుగులో..



రామడుగు: రామడుగు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహించి ఎస్సైగా పదోన్నతి పొంది ఉద్యోగ విరమణ చేసిన జవ్వాజీ రాజయ్యను ఆదివారం ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. పోలీస్ శాఖలో 42 ఏళ్ల సేవలు చేసిన రాజయ్యను పలువురు అభినందించారు.

బీసీ రిజర్వేషన్‌పై తీర్మానం హర్షణీయం

సైదాపూర్: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమని కాంగ్రెస్ సీనియర్ నా యకుడు మునిగంటి సంతోష్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బిల్లు ప్రవేశపెట్టడగా తీర్మానం చేయడాన్ని బీసీ సమాజం సంపూర్ణంగా స్వాగతించాలన్నారు. దేశానికి తెలంగాణ ప్రభుత్వం దిక్సూచి అయిందని, బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గా చూశారని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు పాలించే అధికారం కోసం రిజర్వేషన్లు కల్పిస్తోందని, బీసీలు ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామం జిల్లా పరిషత్ పాఠశాల ఆరో తరగతి విద్యార్థిని పి. ప్రణీత ఇటీవల నిర్వహించిన మండల స్థాయి హ్యాండ్ రైటింగ్ పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం భాగ్య తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థి ఎంపిక పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థిని ఆదివారం అభినందించారు.

మానేరుపై బ్రిడ్జి నిర్మించాలి



మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

గన్నేరువరం: కరీంనగర్ నుంచి గన్నేరువరం మండలానికి మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ కృషి చేయాలని బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ కోరారు. ఆదివారం మండలంలోని మాదాపూర్ గ్రామంలో మాట్లాడారు. కరీంనగర్ శ్మశానవాటిక నుంచి మైలారం మైసమ్మగుట్ట వరకు, డ్యాంలోని వేములవాడ వాటర్ ట్యాంకు నుంచి యాస్వాడ, ఎలగందుల ఖిల్లా నుంచి గన్నేరువరం వరకు మూడ చోట్ల ఎక్కడైనా బ్రిడ్జి నిర్మించాలని గతంలో మంత్రికి ప్రతిపాదనాలు ఇచ్చామన్నారు. మూడు కాదని వేరోచోట బ్రిడ్జి నిర్మాణం చేపడితే ధర్నా, రాస్తారోకోలు తప్పవని తెలిపారు. మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణలు బ్రిడ్జి నిర్మాణం చేపడితే గన్నేరువరం, ఇల్లంతకుంట, బెజ్జంకి మండలాలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. 2013 నుంచి బ్రిడ్జి నిర్మాణానికి పోరాటం చేస్తున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని గుర్తు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో రవి, స్వామి, రాము, బాబు, మైసయ్య పాల్గొన్నారు.

రాకపోకల పునరుద్ధరణ



గంగాధర: మండలంలోని కొండన్నపల్లి స్టేజీ వద్ద కరీంనగర్ – జగిత్యాల నేషనల్ హైవేపై భారీ చెట్టు రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న గంగాధర పోలీసులు చెట్టు తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

ప్రమాదాన్ని లెక్కచేయని సందర్శకులు



తిమ్మాపూర్: లోయర్ మానేరు జలాశయానికి సందర్శకుల తాకిడి పెరుగుతోంది. నీటి మట్టం పెరగడంతో పాటు ఆదివారం సాయంత్రం పెద్ద సంఖ్యలో నీటిలోకి వెళ్లి చాలా సేపు గడిపారు. ఆడ, మగ తేడా లేకుండా అందరూ వర్షాన్ని లెక్క చేయకుండా ప్రమాదం అని తెలిసినా డ్యామ్‌లోకి దిగి కాలక్షేపం చేశారు. సమాచారం అందుకున్న ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ ఎల్‌ఎండీకి చేరుకొని సందర్శకులను అక్కడి నుంచి పంపించేశారు.

విశ్వకర్మల సంక్షేమానికి నిధులు మంజూరు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చిగురుమామిడి: రాష్ట్రంలోని విశ్వకర్మల సంక్షేమానికి ప్రభుత్వం రూ.రెండు వేల కోట్ల నిధులు మంజూరు చేసి విశ్వకర్మలను ఆదుకోవాలని చిగురుమామిడి మండల విశ్వకర్మ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 17న నిర్వహించే విశ్వకర్మ మహాయజ్ఞ మహోత్సవ పోస్టర్‌ను ఆదివారం చిగురుమామిడిలో ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఐదు వృత్తులకు సంబంధించిన పంచాదాయాలను ప్రోత్సహించాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం సంతోషించదగిన విషయమన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో విశ్వకర్మ మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్, గ్రామ అధ్యక్షుడు గొల్లపల్లి సదాచారి పలువురు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి శీలం అశోక్ అన్నారు. ఆదివారం మోత్కులగూడెం, దుర్గాకాలనీల్లో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించి పలు సమస్యలు గుర్తించారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. మండల కమిటీ సభ్యులు రమేశ్‌యాదవ్, సతీశ్, కిషోర్‌కుమార్, రాజకుమారి, కన్నం సదానందం పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న ఆటో డ్రైవర్

తిమ్మాపూర్: మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందిన కనకం రాజేందర్ కరీంనగర్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం గీతాభవన్ వద్ద ఓ మహిళ ఆటో ఎక్కింది. దిగే సమయంలో తన హ్యాండ్‌బ్యాగ్ మరచిపోయింది. బ్యాగ్‌లో సుమారు 4 తులాల బంగారు ఆభరణాలు, నగదు ఉంది. బ్యాగ్‌ను గుర్తించిన రాజేందర్ వెంటనే బాధితురాలిని దింపిన స్థలానికి వెళ్లి అందజేశాడు. ఆ బ్యాగులో ఆమె కుటుంబంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఒకరి చికిత్స కోసం తాకట్టు పెట్టేందుకు తీసుకెళ్లిన బంగారం ఉంది. రాజేందర్ బ్యాగ్ అప్పగించడంతో బాధితురాలు కృతజ్ఞతలు తెలిపింది.

కొడుకులపై తల్లి ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్: బూతులు తిడుతూ కొడుతున్నారని, కొడుకుల నుంచి తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఓ తల్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసిన ఘటన ఆదివారం జరిగింది. కొడుకులు తనను సరిగా చూసుకోవడం లేదని, కనీసం భోజనం కూడా పెట్టకుండా మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని మండలంలోని పెద్దపాపయ్యపల్లె గ్రామానికి చెందిన వృద్ధురాలు శనిగరపు లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని సీఐకి ఫిర్యాదు చేసింది. స్పందించిన సీఐ కరుణాకర్ వెంటనే ఆమె ముగ్గురు కొడుకులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇప్పించారు. తల్లిని బాధ్యతగా చూసుకోవాలని వారి వెంట పం

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు కేజీబీవీలో ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని పాఠశాల ప్రత్యేకాధికారి భార్గవి తెలిపారు. ఆరో తరగతిలో 19, ఏడో తరగతిలో 10, ఇంటర్ ఎంపీసీలో 15, బైపీసీలో 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని పూర్తి వివరాలకు పాఠశాల పనివేళలలో సంప్రదించాలని సూచించారు.

గన్నేరువరం: తిమ్మాపూర్ మండలంలోని గన్నేరువరం కేజీబీవీలో ఖాళీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి రామయ్య, పాఠశాల ప్రత్యేకాధికారి మధులత ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 26, ఏడో తరగతిలో 10, 8వ తరగతిలో 14 సీట్లు ఖాళీలు ఉన్నాయని అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

13న లోక్‌అదాలత్

శంకరపట్నం: మండలంలోని వివిధ గ్రామాల్లోని వారు 13న నిర్వహించే లోక్‌అదాలత్‌లో పాల్గొని కేసులు రాజీ చేసుకోవాలని కేశవపట్నం ఎస్సై శేఖర్‌రెడ్డి సూచించారు. చిన్న కేసులతో జీవితాలు నాశనం చేసుకోవద్దని రాజీ మార్గమే సరైనదన్నారు.

నియామకం

మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో బీజేపీ జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి మియాపురం లక్ష్మణాచారి, శక్తిం కేంద్రం ఇంచార్జ్ దూలం కిరణ్ ఆధ్వర్యంలో ఆదివారం నూతన బూత్‌కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాలవేణి అనిల్, ఉపాధ్యక్షులుగా బాషవేని సంపత్, ఆవుల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి తాటిలంక సతీశ్ నియమించినట్లు తెలిపారు.

కోర్టు సాధన కమిటీ



జమ్మికుంట: పట్టణంలోని వర్తక సంఘం హాల్‌లో జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాలకు చెందిన న్యాయవాదులు ఆదివారం సమావేశమయ్యారు. జమ్మికుంట కోర్టు సాధన అడాక్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. కమిటీలో ఏబూషి లింగారెడ్డి, పొట్లపల్లి శ్రీధర్‌బాబు, మొలుగూరి సదయ్య, నూతల శ్రీనివాస్, రాయికంటి మధుబాబు, పిట్టల రాజేష్, అప్పని రాజు, మ్యాదరి పద్మలత, జోష్ణదేవి, అడ్వైజరీ కమిటీలో వంగల పవన్ కుమార్, కడార్ల సాంబమూర్తి, కనకం తిరుపతిని ఎన్నుకున్నారు. పట్టణంలో మేజిస్ట్రేట్ కం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని న్యాయవాదులు తీర్మానం చేశారు. ఇటీవల మృతి చెందిన సీనియర్ న్యాయవాది శేషాల సారంగపాణికి నివాళి అర్పించారు. న్యాయవాదులు శిరీష, రాజు, వంశీకృష్ణ ,లింగమూర్తి, విజయ్, కళ్యాణ్, వరప్రసాద్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

నిరంతర కృషితోనే ఉన్నత శిఖరాలకు



కరీంనగర్: నిరంతర కృషితోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని ఎస్‌ఆర్ విద్యాసంస్థల కరీంనగర్ జోనల్ ఇన్‌చార్జి తిరుపతి అన్నారు. ఎస్‌ఆర్ కాలేజీ గర్ల్స్ జ్యోతినగర్ విభాగం జూనియర్ కాలేజీ ఫ్రెషర్స్ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జి తిరుపతి మాట్లాడుతూ. ఉన్నత లక్ష్యాలను చేరేందుకు విద్యార్థులు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీన్ అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ



జెండా ఎగురేస్తున్న కులపెద్దలు, యూత్ నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని 16వ వార్డు ఎస్టీ కాలనీలో ఎరుకల కులస్తుల సమక్షంలో ఎరుకల జాతి ఆత్మగౌరవ పోరాట జెండాను ఆదివారం ఆవిష్కరించారు. నాయకులు తిరుపతి శ్రీనివాస్ మాట్లాడుతూ... 1952 ఆగస్టు 31న క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ చట్టం రద్దు చేయబడిన రోజు పురస్కరించుకొని ఎరుకల జాతి ఆత్మగౌరవ పోరాట జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో కుల పెద్దలు తిరుపతి సమ్మయ్య, రేవెల్లి బుచ్చయ్య, తిరుపతి రాజమౌళి, రాజయ్య, కెంసారపు తిరుపతి, కేతిరి సంజీవ్‌కుమార్, తిరుపతి ఎల్లస్వామి, కుర్రరాజు, యూత్ అధ్యక్షుడు లోకిని రాజేశ్, ఉపాధ్యక్షుడు మహేశ్, కోశాధికారి సతీశ్, సయుక్త కార్యదర్శులు ఉండాది అనిల్, అంజి, ప్రచార కార్యదర్శి బాలు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తేనే విజయం



జెండా ఎగరవేస్తున్న వెంకటేశ్వర్‌రావు

రామడుగు: నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేస్తేనే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని రామడుగు సింగిల్ విండో చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు అన్నారు. జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని గోపాల్‌రావుపేట ప్రధాన చౌరస్తాలో పార్టీ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు మార్కొండ కిష్టారెడ్డి, తవుటు మురళి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు మామిడి తిరుపతి, గంట్ల వెంకట్‌రెడ్డి, మండల నాయకులు వీర్ల సంజీవరావు, జూపాక మునీందర్, పూదురు మల్లేశం, పంజాల జగన్‌మోహన్‌గౌడ్, చాడ శేఖర్‌రెడ్డి, దాసరి రాజేందర్‌రెడ్డి, ఒంటెల వెంకటరమణారెడ్డి, జూపాక కరుణాకర్, రవీందర్‌రావు, శేఖర్, ప్రభాకర్, మహేందర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

ఆపదలో అండగా కొండాపూర్ యువకులు



నగదు అందిస్తున్న గ్రూపు సభ్యులు(ఫైల్)

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ గ్రామ యువకులు వాట్సాప్ గ్రూపు ద్వారా ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్నారు. ఎవరికి కష్టం వచ్చినా తక్షణం స్పందిస్తూ బాధిత కుటుంబాలను ఆదుకుంటారు. ఇటీవల కొండాపూర్ గ్రామానికి చెందిన గూల్ల రాజు అనారోగ్యంతో మృతి చెందగా రూ.2.10 లక్షలు సేకరించి మృతుడి కూతురు పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. హుస్నాబాద్ నుంచి కొండాపూర్‌కు వస్తుండగా బుర్ర హరీశ్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆపరేషన్ నిమిత్తం రూ.1.10 లక్షలు అందించారు. గూల్ల నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి రూ.నలభై వేల సాయం చేశారు. నిరుపేద మహిళ బాలవ్వకు ఉండేందుకు ఇల్లు లేదు, రోజువారి కూలీపనులకు వెళ్తూ జీవనం సాగిస్తోంది. రోడ్డు వెంట వస్తుండగా వాహనం ఢీకొనడంతో గాయపడింది. ఆమెకు చికిత్స నిమిత్తం రూ. 25 వేలు అందించామని, రానున్న రోజుల్లో బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ముందుంటామని పిల్లి రమేశ్ తెలిపారు.

లారీ బోల్తా



గంగాధర: మండలంలోని మంగపేట రైల్వే ట్రాక్ సమీపంలో కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై శనివారం రాత్రి మక్కల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాలు.. జగిత్యాల వైపు వెళ్తున్న లారీకి రైల్వే ట్రాక్ వద్ద ఉన్న గేట్లు అడ్డంకిగా మారడంతో తిరిగి కరీంనగర్ వైపు వెళ్లేందుకు రివర్స్ తీసుకుంటుండగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయినట్లు సమాచారం. బోల్తాపడిన లారీని, అందులోని మక్కల బస్తాలను ఆదివారం తీసుకెళ్లారు.

దాచుకున్న డబ్బులతో వీధి దీపాలు

రామడుగు: ఐదేళ్లుగా దాచుకున్న డబ్బుతో గ్రామానికి అవసరమైన వీధి దీపాలను కొనుగోలు చేశారు. వెలిచాల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రావు, కవిత కొడుకులు విశ్వక్‌సేన, జయంత్ ఐదేళ్లుగా పెద్దలు అందజేసిన డబ్బు దాచుకున్నారు. గ్రామానికి అవసరమైన వీధి దీపాలను చిన్నారులు ఆదివారం కొనుగోలు చేసి పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డికి అందజేశారు. ఈసందర్భంగా చిన్నారులను గ్రామస్తులు అభినందించారు.

గిరిజన నాయకుల అరెస్టు

కరీంనగర్: బంజారా, లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసి నాయకులు సోయం బాపురావు, తెల్లం వెంకటరావు సుప్రీంకోర్టులో కేసు వేసిన విషయంపై ఆదివారం హైదరాబాద్‌లో జరుగనున్న చర్చ గోష్టిలో పాల్గొనేందుకు వెళ్తున్న గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీమా సాహెబ్, జిల్లా అధ్యక్షుడు బోడా మోహన్ నాయక్, రాష్ట్ర నాయకులు శివరాజులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీమా సాహెబ్ మాట్లాడుతూ బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించడం చట్టవిరుద్ధమని అన్నారు. రెండు తెగల మధ్య వైషమ్యాలు పెంచి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రయత్నిస్తున్న బాబురావు, తెల్ల వెంకటరావులను అరెస్టు చేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించాలని కోరారు. దీనిపై రాష్ట్రస్థాయిలో గిరిజన సంఘాల తరఫున ప్రభుత్వానికి త్వరలో కొన్ని సూచనలు కూడా చేస్తామని తెలిపారు. అక్రమ అరెస్టులను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు.